
ప్రజాశక్తి
శనివారం 24 జూన్ 2023 | 5 | విజయనగరం



నేర చరిత్ర ఉన్న వారిపై నిఘా

ప్రజాశక్తి-గంట్యాడ

నేర చరిత్ర కలిగిన వ్యక్తులపై నిఘా పెట్టాలని ఎస్‌పి ఎం.దీపిక పోలీసు అధికారులకు సూచిం చారు. స్థానిక పోలీసుస్టేషన్‌ను శుక్రవారం ఆమె పరిశీలించారు. స్టేషన్ ప్రాంగణం, ప్రాపర్టీ గది, స్టేషన్ రికార్డులు, హిస్టరీ షీట్లు, సిడి ఫైల్స్‌ను పరిశీలి ంచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసుల దర్యాప్తు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట రూరల్ సిఐ టివి తిరుపతిరావు, స్థానిక ఎస్ఐ కె.కిరణ్‌కుమార్ నాయుడు పాల్గొన్నారు.



రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్‌పి దీపిక

విద్యుత్తు షాక్‌తో విలవిల

కేంద్ర ప్రభుత్వ దర్శకత్వం, రాష్ట్రంలోని జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం యాక్షన్‌తో ప్రజలకు విద్యుత్ షాక్ తగిలింది. సర్దుబాటు పేరుతోనే యూనిట్‌పై సుమారు రూ.80పైసలకు పైగా పెంచారు. దీంతో నెలకు జిల్లా ప్రజలపై రూ. 80లక్షలు, ఏడాదికి రూ.24కోట్లు భారం పడనుంది. ఇతరత్ర ఛార్జీలు కలిపితే అసలు కన్నా కొసరు ఛార్జీలు ఎక్కువగా ఉన్నాయని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు పేరుతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగదారుల్ని నిలువుదోపిడీ చేస్తున్నాయని పలువురు విశ్లేషిస్తున్నారు.

- సర్దుబాటు పేరిట బాదుడు
- ఏడాదికి రూ.24 కోట్ల భారం
- ఇతరత్రా రూపాల్లోనూ బాదుడే
- మోడీ దర్శకత్వంలో జగన్ యాక్షన్ తీరు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



విజయనగరం ఉమ్మడి జిల్లాలో 8,11,017 విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో గృహాలకు 6,71,921, వాణిజ్యం 68,939, ప్రభుత్వ కార్యాలయాలకు 15,321, వ్యవసాయ పంపుసెట్‌లకు, 52,082 ఉన్నాయి. వీటన్నింటికీ ఎపిఇపిడిసిఎల్ ద్వారా విద్యుత్ సరఫరా అవుతోంది. వినియోగదారులంతా ఎప్పటి బిల్లులు అప్పుడే చెల్లిస్తున్నారు. ఒక వేళ గడువు తేదీలోపు చెల్లించకపోతే ఫీజులు పీకేసి మరీ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నారు. అయినప్పటికీ లెక్కలు వేశాక వినియోగదారులు చెల్లించిన డబ్బులు విద్యుత్తు ఉత్పత్తికి, పంపిణీ తదితర ఖర్చులకు సరిపోలేదంటూ వసూలు చేస్తున్నారు. సర్ధుబాటు ఛార్జీ అంటే ఇదే. మరే సంస్థలోనూ లేని విధంగా విద్యుత్ పంపిణీ సంస్థల్లోనే ఇటువంటి విధానం అమలవుతుంది. ఇందులో భాగంగానే 2014 నుంచి 19 వరకు వినియోగించుకున్న విద్యుత్‌కు చెల్లించిన బిల్లులు సరిపోలేదంటూ రాష్ట్ర వ్యాప్తంగా రూ.2,900 కోట్లమేర సర్ధుబాటు భారం మోపింది. జనం నుంచి మూడేళ్లపాటు వసూలు చేయడానికి విద్యుత్ ఛార్జీల నియంత్రణ మండలి ద్వారా విద్యుత్ పంపిణీ సంస్థలు ఆమోదం పొందాయి. ఇప్పటికే యూనిట్‌కు 20పైసలు చొప్పున 11నెలల పాటు వినియోగదారులు చెల్లించారు. మరో 25నెలలపాటు ఇంకా చెల్లించాల్సివుంది. ఇది చాలదన్నట్టుగా 2021 -22 ఆర్థిక సంవత్సరంలో వినియోగించిన విద్యుత్ బిల్లులకు చెల్లించిన మొత్తం సరిపోలేదంటూ మరోసారి 20పైసలు చొప్పున సర్ధుబాటు ఛార్జీలు మోపుతున్నారు. పాత, కొత్త సర్ధుబాటు ఛార్జీలు 40పైసలు మోయడమే వినియోగదారులకు అత్యంత కష్టతరంగా మారింది. ఇటువంటి పరిస్థితుల్లో విద్యుత్ భారాన్ని తగ్గించాల్సిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు పడుతున్న భారాలకు ఎప్పటి వరకో ఎందుకు ఆగాలి అంటూ మరుచటి నెలలోనే సర్ధుబాటు ఛార్జీలు వసూలు చేయాలని ఆదేశించింది. మోడీ ఆదేశాలే తడువుగా జగన్ సర్కారు ఏప్రిల్ నెలలో చెల్లించిన డబ్బులు సరిపోలేదని మరో 40పైసలు వసూళ్లకు సిద్ధపడింది. ఈ లెక్కన కేవలం సర్ధుబాటు ఛార్జీ రూపంలోనే 80పైసలు భారం పడుతోంది. జిల్లాలో రోజుకు సుమారు కోటి యూనిట్ల వినియోగం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వాసులపై నెలకు రూ.80లక్షల వరకు భారం పడుతోంది. ఏడాదికి రూ.24కోట్ల పైమాటే భారం. దీనికితోడు నెలవారీ వినియోగపు బిల్లు, ఫిక్స్‌డ్ ఛార్జీ, కస్టమర్ ఛార్జీ, ట్రూ అప్ ఛార్జీ తదితరాల రూపంలో అధిక మొత్తంలో బిల్లులు విధించారు. 20 నుంచి 30 యూనిట్లు వినియోగించిన సామాన్య కుటుంబాలకు వేల రూపాయల బిల్లులు వస్తున్నాయి. దీంతో, గత నెలతో పోలిస్తే రెట్టింపు స్థాయిలో బిల్లులు వచ్చాయంటూ వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు ఛార్జీకన్నా ఇలా కొసరుగా విధిస్తున్న ఛార్జీలే అధికంగా ఉన్నాయి. దీంతో, తమకు అర్థం కాకుండా కొత్తకొత్త రూపాల్లో ఛార్జీలు పెంచి తమను మోసం చేస్తున్నారని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి సర్ధుబాటు ఛార్జీలకు పాలకుల విధానాలే కారణం. బొగ్గు, ఇంధన రేట్లు కార్పొరేట్ సంస్థలు తమ ఇష్టానుసారంగా పెంచుకునేందుకు సహకరిస్తున్నాయి. ఫలితంగా విద్యుత్ తయారీ, పంపిణీ సంస్థలపై పెరిగిన భారాన్ని ప్రజలపై మోపేందుకు బార్లు తెరుస్తున్నాయి.

ఎలా బతకాలి?



మే నెలలో కరెంటు బిల్లు రూ.130 వచ్చింది. ఈనెల రూ.330 వచ్చింది. ఒక లైటు, ఒక ఫ్యాను వేసుకుంటే ఇంత భారమా? ఇందేం పని అని కరంటోళ్లను అడిగితే అదేదో ఛార్జీలు పెరిగాయంటున్నారు. నెలరోజుల వ్యవధిలో రెట్టింపు కన్నా మించిపోయింది. మరీ ఇంత మోసమా? గ్యాస్ ధర కూడా పెంచేశారు. ఇప్పుడు కరెంట్లో పని. ఎలా బతకాలి? ఎవరికి చెప్పుకోవాలి?

– టి. విజయమ్మ, గృహిణి, గుమ్మలక్ష్మీపురం

చిన్న వ్యాపారులం బతకలేం



నా లాంటి చిరువ్యాపారులు బతకలేరు. 15ఏళ్లగా జ్యూస్ దుకాణం నడుపుతున్నాను. ఇదే జీవనాధారం. మిక్సీవాడడం వల్ల చాలా కాలంగా నెలకు రూ.800 నుంచి రూ.1000 కరెంటు బిల్లు వచ్చేది. బిజినెస్ పెరగక పోయినప్పటికీ జూన్ నెల బిల్లు రూ.1,526 వచ్చింది. ఇలా అయితే జీవనోపాధి కోల్పోయినట్టే.

– కె.రమేష్, జ్యూస్ వ్యాపారి, పూసపాటిరేగ



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

'ట్రూ అప్' భారాన్ని ఉపసంహరించాలి

- 30న జిల్లా వ్యాప్తంగా నిరసనలు
- విద్యుత్తు భవనాల వద్ద ఆందోళనలు
- వామపక్షాల పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ట్రూ అప్ పేరుతో పెంచిన విద్యుత్తు ఛార్జీలను రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 30న జిల్లా వ్యాప్తంగా అన్ని విద్యుత్తు కార్యాలయాలు, మండల కేంద్రాల్లో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని సిపిఎం, సిపిఐ, సిపిఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీల జిల్లా కార్యదర్శులు తమ్మినేని సూర్యనారాయణ, ఒమ్మి రమణ, బి.శంకర్రావు తెలిపారు. స్థానిక ఎల్‌బిజి భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై, విద్యుత్ ఛార్జీలను అమాంతంగా పెంచి ప్రజలపై రూ.1400 కోట్ల భారాలు మోపుతున్నాయని అన్నారు. గతంలో ఏడాదికో, రెండేళ్లకో విద్యుత్ ఛార్జీలు పెంచేవారని, ఇప్పుడు మరి దారుణంగా ప్రతి నెలా ఛార్జీలు పెంచుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కరెంటు బిల్లుల ఛార్జీల పేరుతో రూ.6వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపారని తెలిపారు. నాలుగేళ్లలో రూ.26 వేల కోట్ల కరెంటు ఛార్జీల బారాలు ప్రజల నెత్తిన మోపారన్నారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో యూనిట్‌కు 80 పైసలు చొప్పున పెంచారని అన్నారు. ఈ విధంగా కరెంటు చార్జీలను ప్రజలు మోయలేని విధంగా పెంచుతూ కార్పొరేట్ శక్తులకు వేల కోట్లలో ప్రజాధనం సమకూర్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానాలను ప్రజలందరూ తిప్పికొట్టేందుకు జూన్ 30న వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జరిగే ఆందోళన కార్యక్రమాల్లో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు, సిపిఐ నాయకులు ఆనందరావు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమం.. జగనన్న సురక్ష లక్ష్యం

- నేటి నుంచి గ్రామస్థాయిలో గృహ సందర్శన
- ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలపై ఆరా
- జులై 1 నుంచి ఉచితంగా 11 రకాల సేవలు
- కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

అర్హత ఉన్న ప్రతీ ఇంటికీ సంక్షేమ పథకాలను అందించడం, ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి పేర్కొన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం ఆన్ లైన్ వీడియా కాన్ఫరెన్సు ద్వారా ప్రారంభించారు. ముఖ్యమంత్రి ప్రసంగం అనంతరం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలో శుక్రవారం నుంచి జులై 23 వరకే జరిగే ఈ కార్యక్రమంలో పట్టణ, గ్రామ వాలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుంటారని, ఎవరైనా అర్హులు సంక్షేమ పథకాలు అందకుండా మిగిలిపోయి ఉంటే, వారికి కూడా పథకాలను వర్తింపజేస్తారని తెలిపారు. ఈ బృందాలు జిల్లాలోని సుమారు 4.85లక్షల ఆవాసాలకు వెళ్లి, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏ స్థాయిలో అందుతున్నాయో వివరించడమే కాకుండా, నాలుగేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధి, లబ్ధిదారులకు అందించిన ప్రయోజనాలను తెలియజేస్తారని చెప్పారు. సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించడమే కాకుండా, రేషన్ కార్డుల్లో పేర్లు జత చేయడం, కార్డుల విభజన తదితర కార్యక్రమాలతో పాటు, కుల, ఆదాయ ధ్రువీకరణ, జనన, మరణ, వివాహ, తదితర పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకే వెళ్లి ఉచితంగా ధ్రువపత్రాలను అందించనున్నారని తెలిపారు. ప్రత్యేక క్యాంపుల నిర్వహణ కోసం మండలాల వారీగా ఎంపిడిఒ, తహశీల్దార్ల ఆధ్వర్యంలో రెండు వేర్వేరు బృందాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఒక్కో బృందంలో ముగ్గురు చొప్పున మండల స్థాయి అధికారులు ఉంటారని, మొత్తం సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ నాగలక్ష్మి, జెసి మయూర్ అశోక్

జులై 1 నుంచి ప్రత్యేక క్యాంపులు

జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేయనున్న ఈ క్యాంపులలో 11 రకాల సేవలు, ధ్రువీకరణ పత్రాలను అక్కడికక్కడే జారీ చేస్తారు. ఈ నెల 24 నుంచి వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వీటిపై అవగాహన కల్పిస్తారు. వినతుల స్వీకరణ, రిజిస్ట్రేషన్లు, వెరిఫికేషన్, సర్వీసు రిక్వెస్టులకు వేరువేరు డెస్కులను ఏర్పాటు చేస్తారు. మ్యుటేషన్ ఆఫ్ ట్రాన్సాక్షన్‌కు సంబంధించి పాస్ పుస్తకాల జారీకి మాత్రం నిర్ణీత ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ సేవల గురించి, తమ గ్రామంలో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమం షెడ్యూల్ గురించి 1902 హెల్ప్ డెస్క్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు. సిఎంతో జరిగిన సమావేశంలో జిల్లాకు చెందిన ఎమ్మెల్సీలు సురేష్‌బాబు, రఘురాజు, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, నగర మేయర్ వి.విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్లు కోటగట్ల శ్రావణి, ఎం.లయ యాదవ్, వేరే కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాకు వచ్చిన కర్నూలు జెడ్‌పి ఛైర్మన్ వై.పాపిరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సర్వే 7 రోజుల్లో పూర్తి చేయాలి


ఆర్‌డిఒలు, డిఎల్‌డిఒలు, మండల ప్రత్యేకాధికారులు, తహశీల్దార్లు, ఎంపిడిఒలతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. జగనన్న సురక్ష సర్వే 7 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. వాలంటీర్లతో పాటు సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా ఈ సర్వే లో పాల్గొనాలని సూచించారు. తర్వాత మూడు రోజులు వాటిని పరిశీలించడానికి, తదుపరి రెండు రోజులు డాకుమెంట్ల తయారీకి కేటాయించాలన్నారు. ప్రతి రోజు ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు క్యాంపు నిర్వహించాలని, ఈ క్యాంపులలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, మున్సిపల్ కమీషనర్ శ్రీరాములు నాయుడు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధే నీతి అయోగ్ ధ్యేయం

- అటల్ ఇన్నోవేషన్ మిషన్ ఆఫీసర్ సోహిల్ షేక్
- మంగళపాలెంలో ఎసిఐసి ప్రాజెక్టు ఏర్పాటుకు పరిశీలన

ప్రజాశక్తి-కొత్తవలస

గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల అవసరాలకు అనుగుణంగా వారిని సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చేయడంలో ప్రత్యేక ప్రణాళికతో కేంద్ర ప్రభుత్వం నీతి అయోగ్ ద్వారా కృషి చేస్తోందని నీతి అయోగ్ అటల్ ఇన్నోవేషన్ మిషన్ ఆఫీసర్ సోహిల్ షేక్ తెలిపారు. మండలంలోని మంగళపాలెంలో శ్రీ గురుదేవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జల్స్ టెక్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థ సంయుక్తంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నీతి అయోగ్ ద్వారా చేపట్టిన ఎన్నో అభివృద్ధి కార్యక్రమాల ద్వారా ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకుని మరింత అభివృద్ధి చెందాలన్నారు. జెల్స్ టెక్ ప్రదర్శించిన పలు సైన్స్ అండ్ టెక్నాలజీ ప్రాజెక్టులను, భవనాలను సోహిల్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఎసిఐసి (అటల్ కమ్యూనిటీ ఇన్నోవేషన్ సెంటర్) ప్రాజెక్టు ఏర్పాటుకు ఇక్కడ అనుకూలమా కాదా అని ఆయన పరిశీలించారు. అనంతరం పలువురు వికలాంగులకు కృత్రిమ అవయవాలు, ఉపకారణాలను సోహిల్ పంపిణీ చేశారు. ముందుగా ట్రస్ట్ ప్రాంగణంలోని అవయవ తయారీ కేంద్రం, గురుదేవ హాస్పటల్ ను అయన సందర్శించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చెర్మన్ రాపర్తి జగదీశ్ కుమార్ మాట్లాడుతూ యువత మంచి భవిష్యత్తును సాకారం చేసుకునే దిశగా ఏసిఐసి ప్రాజెక్టును మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఇజిఎస్ అంబుడ్స్ పర్సన్ డాక్టర్ అన్నపూర్ణ సతపతీ, జెల్స్ టెక్ సంస్థ డైరెక్టర్లు జెబివి సుబ్రహ్మణ్యం, బిఎన్‌రావు, సంస్థ ప్రతినిధులు మురళీకృష్ణ, శరత్, ట్రస్ట్ ప్రతినిధులు ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.



వికలాంగులకు కృత్రిమ అవయవాలు అందిస్తున్న నీతి అయోగ్ బృందం

వెల్లివిరిసిన చైతన్యం

- రక్తదాన శిబిరానికి పోటెత్తిన దాతలు
- 251 యూనిట్ల రక్తం సేకరణ

ప్రజాశక్తి-బొబ్బిలి

సామాజిక సేవలో మున్సిపల్ మాజీ ఛైర్మన్, టిడిపి బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన ఎల్లప్పుడూ ముందుంటారు. ఆపద.. అనగానే సాయం చేసే గుణం ఆయనది. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సాయం చేయడం ఆయన నైజం. అలాంటి వ్యక్తి జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి అభిమానులు పోటెత్తారు. అత్యవసర సమయాల్లో రక్తం కొరతను అధిగమించేందుకు దాతలు ముందుకు రావాలన్న బేబినాయన పిలుపు మేరకు కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి, రక్తదానం చేశారు.

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన జన్మదిన వారోత్సవాలలో భాగంగా శుక్రవారం బొబ్బిలి కోటలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. తమ అభిమాన నేత జన్మదినం సందర్భంగా నిర్వహించిన శిబిరంలో రక్తదానం చేసేందుకు యువత, టిడిపి కార్యకర్తలు, అభిమానులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. రక్తదానం చేసేందుకు 400 మంది హాజరుకాగా, 251 మంది నుంచి రక్తాన్ని సేకరించారు. ముందుగా రక్తదాన శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, బేబినాయన కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో రక్తనిల్వలు నిండుకోవడంతో అనేకమంది రోగులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రక్తం కొరతను నివారించేందుకు రక్తదానం చేసేందుకు యువత ముందుకు రావాలని కోరారు. రక్తదానం చేస్తే ప్రాణదానం చేసినట్లేనని చెప్పారు. బొబ్బిలి బ్లడ్ బ్యాంకు, విజయనగరం రెడ్ క్రాస్, రోటరీ బ్లడ్ బ్యాంకు సిబ్బంది రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ, మండల అధ్యక్షులు రాంబార్కి శరత్, వాసిరెడ్డి సత్యనారాయణ, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



రక్తదాతలను అభినందిస్తున్న బేబినాయన

క్వారీ పేలుళ్లతో తీవ్ర నష్టం

ప్రజాభిప్రాయ సేకరణలో స్థానికులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని ధర్మవరం వద్ద గల సన్యాసయ్య పాలెం, ఆలుగుబిల్లి గ్రామం వద్ద ఎస్‌విఎస్ మూకాంబిక కన్‌స్ట్రక్షన్ ప్రైవేట్ లిమిటెడ్, గంగాభవాని సంస్థకు క్వారీలకు అనుమతులు ఇవ్వవద్దని, వాటి వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు వస్తాయని స్థానికులు తెలిపారు. ఈ సంస్థలకు క్వారీలు కేటాయించేందుకు పర్యావరణశాఖ ఇంజినీర్ సరిత అధ్యక్షతన డిఆర్‌ఒ గణపతరావు ఆధ్వర్యంలో క్వారీ బ్లాస్టింగుల అనుమతుల కోసం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో స్థానికులు పలు సమస్యలను లేవనెత్తారు. ఆలుగుబిల్లి క్వారీల యాజమాన్యాలు కంప్రెసర్ ద్వారా రంధ్రాలు చేయకుండా రిగ్గింగ్ మిషన్ ద్వారా సుమారు 100 నుండి 150 అడుగుల వరకు రంధ్రాలను చేసి భారీ పేలుళ్లు చేస్తున్నారని, వీటి వల్ల ఇళ్లు బీటలు వారుతున్నాయని తెలిపారు. బ్లాస్టింగ్లు వల్ల వచ్చే దుమ్ము ధూళితో తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నామని తెలిపారు. అయితే ఈ జిల్లాతో సంబంధం లేని ఎన్జీవోలు, పర్యావరణ ప్రేమికులు వచ్చి ఈ ప్రాంతంలో ఉన్న క్వారీల అనుమతుల కోసం ప్రాధేయపడటం స్థానికులను ఆశ్చర్యపరిచింది. ఈ సంస్థల యజమానులు భారీ బ్లాస్టింగ్లకు పాల్పడుతున్నారని. పర్యావరణను కాలుష్యం చేస్తున్నారని. స్థానికులు గతంలో గగ్గోలు పెట్టినప్పుడు కనిపించని వీరంతా క్వారీ అనుమతులు ఇచ్చేందుకు అభ్యంతరం లేదని చెప్పడం పట్ల స్థానికులు ఆవేదన చెందుతున్నారు. పాత అలుగుబిల్లికి చెందిన ఏల సన్యాసి మాట్లాడుతూ 20 ఏళ్లగా ఈ ప్రాంతంలో నడుపుతున్న క్వారీల వల్ల అధిక శాతం స్థానికులు నష్టపోతున్నారని అన్నారు. స్థానికులు క్యాన్సర్ బారిన పడుతున్నారని, ఇళ్ల దెబ్బతినకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.



క్వారీ యజమానులు నిబంధనలు పాటించాలని చెబుతున్న స్థానికుడు

20 శాతం ప్రీమియంతో 100 శాతం పశు బీమా

జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి విశ్వేశ్వరరావు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

రైతులు 20శాతం ప్రీమియం చెల్లిస్తే ప్రభుత్వం వంద శాతం పశు బీమా అందజేస్తుందని జిల్లా పశువర్ధక శాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ధర్మవరం గ్రామంలో ధర్మవరం పశు వైద్యాధికారి జి.హేమ ఆధ్వర్యంలో పశుభీమా పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ. పశుబీమా ద్వారా పశువులకు ఇన్సూరెన్స్ మూడు సంవత్సరాలు చేస్తారని అన్నారు. మగ పశువులకు, ఆవులకు, గేదెలకు, గొర్రెలకు మేకలకు ఇన్సూరెన్స్ చేయించు కోవచ్చని తెలిపారు. గ్రామాల్లో పశువైద్య సహాయకుల ద్వారా ఇన్సూరెన్స్ సేవలు పొందొచ్చని అన్నారు. విజయనగరం డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వైవి రమణ మాట్లాడుతూ ప్రతీ పాడిరైతు ఈసదవకాశాన్ని వినియోగించుకొని అన్ని పశువులకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని కోరారు. విజయనగరం అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ కన్నంనాయుడు మాట్లాడుతూ పాడి రైతు కావాలంటే తమ పశువుకు 3వేల కంటే అదనంగా కూడా ఇన్సూరెన్స్ చేయించుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఎస్.కోట సహాయ సంచాలకులు డాక్టర్ బి.చలపతిరావు, పశు వైద్య సహాయకులు, పారా వెటర్నరీ సిబ్బంది, గోపాలమిత్రలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి విశ్వేశ్వరరావు

నేడు జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం శనివారం కలెక్టర్ కార్యాలయంలో జరగనుంది. మధ్యాహ్నం 3 గంటలకు జరిగే ఈ సమావేశానికి మండలి ఛైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు, జిల్లా ప్రజాప్రతినిధులు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు పాల్గొంటారని జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు తెలిపారు

ఆర్‌టిసిలో డ్రైవింగ్ శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఎపిఎస్ ఆర్‌టిసి డ్రైవింగ్ శిక్షణ కళాశాలలో ఈనెల 23 నుంచి 12వ బ్యాచ్ శిక్షణ ప్రారంభమైంది. డిపిటిఒ సిహెచ్ అప్పలనాయుడు డిపో గ్యారేజి ఆవరణలో ఈ శిక్షణను ప్రారంభించారు. డ్రైవింగ్ శిక్షణను సమర్థవంతంగా పూర్తి చేసుకొని, సద్వినియోగం చేసుకొవాలని సూచించారు. డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ల నుంచి డ్రైవింగ్ నైపుణ్యాలను, మెలకువలను నేర్చుకోవాలని అన్నారు. తద్వారా అందరూ ఉత్తమ డ్రైవర్లుగా అభివద్ధి చెందాలని ఆకాంక్షించారు. అసిస్టెంట్ డిపో మేనేజర్ బి.ఆదినారాయణ మాట్లాడుతూ డ్రైవింగ్ శిక్షణ తఅనంతరం నిర్ణీత సమయకాలం తర్వాత ఆర్టీసీలో అవకాశాలను అందిపుచ్చు కోవాలని అన్నారు. కార్యక్రమంలో డిపో ఎస్‌డిఐలు సిహెచ్ వేణు, బివిఆర్‌ఎం రాజు , డిఎన్ రాజు పాల్గొన్నారు.

25న ఒలింపిక్ డే రన్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రపంచ ఒలింపిక్ దినోత్సవం సందర్భంగా ఈనెల 25న స్థానిక రాజీవ్ క్రీడా ప్రాంగణం నుంచి కోట జంక్షన్ వరకు జరిగే ఒలింపిక్ రన్ కార్యక్రమంలో క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, క్రీడాభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గురాన. అయ్యలు కోరారు. శుక్రవారం స్థానిక జిఎస్ ఆర్ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఈర్యాలీ నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ఒలింపిక్ డే టీ షర్టులను, టోపీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ నాయకులు సుభాష్ చంద్రబోస్, వి.మల్లి, ఆదినారాయణ, లీలాకృష్ణ, ఆనంద్ పాల్గొన్నారు.

25న రచయితల వేదిక సమావేశం

రాజాం : రాజాం రచయితల వేదిక 101వ సమావేశం ఈనెల 25 ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో జరుగుతుందని వేదిక నిర్వాహకుడు గార రంగనాథం తెలిపారు. ప్రముఖ రచయిత డాక్టర్ అత్తి మోహనరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో రాజావు శాంతారావు 'అర్ధనారి నవల -సామాజిక పరిశీలన' అనే అంశంపై ముఖ్య ప్రసంగం చేస్తారని తెలిపారు. అనంతరం సభ్యుల స్వీయరచనా పఠనం ఉంటుందన్నారు.

టెన్త్ సప్లిమెంటరీలో 64.71 శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

విద్యాశాఖ శుక్రవారం విడుదల చేసిన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో పార్వతీపురం ఉమ్మడి విజయనగరం జిల్లాలో 6,126 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 3,819 (62.34శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 1,414 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వగా 915(64.71) మంది పాసయ్యారు. రెండు జిల్లాల్లో 7,540 మంది పరీక్ష రాస్తే.. 4,734 మంది పాసయ్యారని, 2,806 మంది ఫెయిలయ్యారని తెలిపారు. ఫలితాల్లో పార్వతీపురం మన్యం జిల్లా12వ స్థానం, విజయనగరం 14వ స్థానంలో నిలిచింది.

ఇంటి స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని కుమిలిలో ఇంటి స్థలం ఆక్రమించి నిర్మాణం చేపడుతున్న వెల్దాడి చిన్నపై తూతుకు శ్రీనివాసరావు శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేసాడు. తమ ఇంటి స్థలం ఆక్రమించి నిర్మాణం చేపడుతున్న చిన్నపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ ఆక్రమణ విషయమై కోర్టులో ఉందని, తాము లేని సమయంలో అక్రమంగా నిర్మించే ప్రయత్నం చేస్తున్నాడంటూ శ్రీనువాసరావు తెలిపాడు. ఇప్పటికే ఈ విషయమై స్పందనలో కలెక్టర్ తో పాటు స్థానిక ఎంపిడిఒ, తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్లో కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎంపిడిఒ రామారావు , తహసిల్దార్ భాస్కరరావు ఆక్రమణ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి ఆక్రమణ జరిగిందని నిర్ధారణ చేసారన్నారు. అయినా నిర్మాణం చేయాలని ప్రయత్నించడం అన్యాయమే అన్నారు. విషయం తెలుసకున్న చిన్న కుటుంబీకులు స్పందించి ఆక్రమణ జరిగిందని, సరిచేస్తామని కోరారు. అక్రమణ చేసి నిర్మాణం చేసిన గోడలు వెంటనే కూల్చేయాలని శ్రీనివాసరావు కోరారు. ఆక్రమణ నుండి ఖాళీ చేస్తేనే ఫిర్యాదు వెనక్కి తీసుకుంటామన్నారు.

చెరువు ఆక్రమణలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

చెరువు గర్భం ఆక్రమణలు అరికట్టాలని ఎపి రైతు సంఘం మండల నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. శుక్రవారం తహశీల్దార్‌కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరజాపుపేటలో కొంతలవాని చెరువును ఆక్రమించి, నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. ఇదే విషయంపై నగర పంచాయతీ కమిషనర్, నీటి పారుదల శాఖ జెఇకి ఫిర్యాదు చేసినట్లు రామారావు తెలిపారు.

జాకేరు ఫీల్డ్‌అసిస్టెంట్‌గా దేవి

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జాకేరు ఫీల్డ్‌అసిస్టెంట్‌గా కాటపల్లి దేవిని నియమిస్తూ ఎంపిపి దొగ్గ సత్యవంతుడు శుక్రవారం ఆమెకు నియామక పత్రం అందించారు. ఫీల్డ్‌అసిస్టెంట్ కాటపల్లి శ్రీను అనారోగ్యానికి గురై మరణించడంతో ఆయన భార్య దేవిని ఆ స్థానంలో నియమించారు. కార్యక్రమములో ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, గ్రామ నాయకులు అప్పలనాయుడు, వైస్ ఎంపిపి ఈశ్వరరావు, ఎంపిటిసి టి.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

విత్తన తయారీపై అవగాహన

ప్రజాశక్తి-కొత్తవలస

మండలంలోని దెందేరులో గ్రామ సంఘం, సభల సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ వారి సహకారంతో రైతు భరోసా కేంద్రం వద్ద సామూహికంగా వరి విత్తనాలను, విత్తన గుళికల తయారీపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ సుమారు 0.05 సెంట్లులో నాటడానికి ముందుగా తయారు చేసుకున్నారు. విత్తన గుళికలు వాతావరణం పరిస్థితులను ఉష్ణోగ్రతల నుండి చీడపీడల నుండి రక్షణ పొంది 100శాతం మొలకెత్తి రైతులకు మంచి వరి నారు దిగుబడి పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం ఫీల్డ్ కోఆర్డినేట్ బి. గోవిందరావు తెలిపారు. కార్యక్రమంలో దెందేరు గ్రామ సర్పంచ్ విరోతి వెంకటరమణ , ఉప సర్పంచ్ బాలిపోయిన ముసలి నాయుడు, ప్రకృతి వ్యవసాయ ఎపిఎం ఎ. వెంకటరమణ, వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ కోటి బాబు, రైతు భరోసా కేంద్రం విఎఎ హేమ ,విఒఎ సంతోషి, మహిళా రైతులు పాల్గొన్నారు.

గురజాడ పాఠశాల రజతోత్సవ ర్యాలీ

ప్రజాశకి-విజయనగరం టౌన్

నగరంలోని కంటోన్మెంట్‌లోగల గురజాడ పాఠశాల ఏర్పాటై 25ఏళ్లు పూర్తయిన సందర్భంగా శుక్రవారం రజతోత్సవ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని డాక్టర్ విఎస్ ప్రసాద్, 39వ డివిజన్ కార్పొరేటర్ ప్రభాకరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా విఎస్ ప్రసాద్ మాట్లాడుతూ గత 25 ఏళ్లగా గురజాడ పాఠశాల అనేక మంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిందని తెలిపారు. నేడు ఆ విద్యార్థులంతా ఉన్నతస్థాయిలో ఉండడం అభినందనీయమని అన్నారు. పాఠశాల కరస్పాండెంట్ ఎం.స్వరూప మాట్లాడుతూ రజతోత్సవాల్లో భాగంగా ఈనెల 24న పూర్వ విద్యార్థుల సమావేశం, 25న వార్షికోత్సవ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పూడి శేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

30న రేగిడి మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-రేగిడి

స్థానిక మండల సర్వసభ్య సమావేశం ఈనెల 30న ఉదయం 10 గంటలకు ఎంపిపి ధార అప్పల నరసమ్మ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఇంఛార్జి ఎంపిడిఒ బాసూరు శంకరరావు తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే ,ఎమ్మెల్సీ రానున్నట్లు తెలిపారు. వివిధ శాఖాధికారులు సభ్యులు అడిగిన ప్రశ్నలకు గ్రామస్థాయి పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు. ఎంపిటిసిలు, సర్పంచులు, నాయకులు తప్పక హాజరవ్వాలని తెలిపారు.

పౌష్టికాహారం అందించాలి

ప్రజాశక్తి-రేగిడి

అంగన్వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం, చిన్నారులకు ఆటపాటలతో విద్యను అందించాలని రేగిడి సెక్టార్ సూపర్‌వైజర్ శశికళ అన్నారు. ఈ మేరకు శుక్రవారం రేగిడి, ఆమదాలవలస అంగన్వాడీ కేంద్రాలలో జన భాగ్య దారి కార్యక్రమంలో భాగంగా చిన్నారి తల్లిదండ్రులు, గర్భిణులతో సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి అనంతరం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో ప్రభుత్వం అందించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలన్నారు. చిన్నారులకు చార్టుల ద్వారా ఓనమాలు, ఆటపాటలతో విద్య అందించాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కె.రమణమ్మ, పి.రాములమ్మ, బి.మేరీ, బి.అరుణ కుమారి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సచివాలయ భవనం.. పశువులకు నిలయం

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని ఆతవలో నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనం పశువులకు నిలయంగా మారింది. ఈ గ్రామానికి ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నికైన గొంప వేమన రాము ఈ గ్రామాభివృద్ధిని పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామంలో నిర్మాణం తలపెట్టిన సచివాలయ భవనం మధ్యలోనే నిలిచిపోయింది. దీంతో ఈ భవనంలో పశువులను కట్టడం, రైతులు పనిముట్లు దాచుకోవడానికి వినియోగిస్తున్నారు. ఈ విషయంపై మండల పరిషత్ ఇంజనీరింగ్ అధికారి ఆలీని వివరణ కోరగా కాంట్రాక్టర్‌తో సంప్రదింపులు జరిపామని ఈ మధ్య కాలంలో ఆగిపోయిన పనులను పూర్తి చేస్తామని చెప్పారు. కాగా ఈ గ్రామానికి సీతంపేట జంక్షన్ నుంచి ఉన్న రెండు కిలోమీటర్ల రహదారి పూర్తిగా శిథిలమైంది. ఈ రహదారి గురించి కూడా సర్పంచ్ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధతో సచివాలయ భవనాన్ని పూర్తి చేయడంతో పాటు గ్రామానికి వచ్చే రహదారిని బాగు చేయాలని కోరుతున్నారు.



నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనంలో కట్టిన గేదె

శవాల పేరుతో ఉపాధి మస్తర్లు

- చింతాడవలస ఫీల్డ్‌అసిస్టెంట్ నిర్వాకం
- ఎంపిడిఒ విచారణలో స్థానికుల ఏకరువు
- ఆర్‌టిఐ సమాచారంపై ఎపిఒ మాట మార్పు
- బహిరంగ విచారణలో స్వల్ప తోపులాట

ప్రజాశక్తి-మెంటాడ

మండలంలోని చింతాడవలసలో ఉపాధి హామీ అమల్లో అవకతవకలు, అక్రమాలు జరిగినట్లు అందిన ఫిర్యాదుపై ఎంపిడిఒ త్రివిక్రమరావు, ఎపిఒ చిన్నప్పయ్య శుక్రవారం ఆ గ్రామంలో బహిరంగ విచారణ నిర్వహించారు. స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ రామునాయుడు చనిపోయిన కూలీల పేరుపైనా మస్తర్లు నమోదు చేశారని, మంచానికే పరిమితమై ఏనాడూ పనికి హాజరుకాని వ్యక్తులకు కూడా మస్తర్లు వేస్తూ నిధుల దుర్వియోగానికి పాల్పడుతున్నారని తదితర అభియోగాలతో చింత పైడితల్లి, తదితరులు కలెక్టర్, ఎంపిడిఒకు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఎంపిడిఒ విచారణ చేపట్టారు. చనిపోయిన కూలీల జాబ్ కార్డులు రద్దు చేయకుండా వారి పేరిట మస్తర్లు వేస్తున్న



తోపులాటకు దిగిన ఇరుగ్రూపులు

విషయాన్ని ఫిర్యాదుదారులు విచారణలో పునరుద్ఘాటించారు. 2018 డిసెంబర్‌లో చనిపోయిన చింత సింహాచలం.. 2019 జూన్‌లో పనికి హాజరయ్యారని మస్తర్లు వేశారని తెలిపారు. 2019 ఫిబ్రవరిలో మరణించిన తాడ్డి పైడితల్లికి 2021లో, 2017 ఆగస్టులో మృతిచెందిన తలారి ధంతీశ్వరరావు పేరిట 2022 మార్చిలో మస్తర్లు నమోదు బాగోతాన్ని ఆధార సహితంగా వివరించారు. కదల్లేని స్థితిలో మంచానికే పరిమితమైన చింతా సింహాచలం పేరుతో మస్తర్లు వేసిన వైనాన్ని వారు స్పష్టంచేశారు. గ్రామంలో 180 గృహాలుంటే 214 జాబ్ కార్డులు ఎలా వచ్చాయో చెప్పాలని వారు డిమాండ్ చేశారు. అంతే కాకుండా ఫీల్డ్ అసిస్టెంట్ రామునాయుడు బినామీ మస్తర్ల నమోదులో ఆరితేరి పోయారని ధ్వజమెత్తారు.

ఫీల్డ్ అసిస్టెంటు రామునాయుడు అవినీతి గతంలోనూ సమాచార హక్కు చట్టం సాక్షిగా బట్టబయలైన విషయాన్ని ఫిర్యాదుదారులు గుర్తు చేశారు. అప్పట్లో ఆయన నుంచి రికవరీ కూడా చేయించిన విషయాన్ని ఎంపిడిఒ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు ఎపిఒ చినప్పయ్య ఆర్‌టిఐ కింద ఇచ్చిన సమాచారాన్ని ఎంపిడిఒ వివరించారు. వెంటనే ఎపిఒను ఎంపిడిఒ వివరణ కోరగా, తాను అలా ఇవ్వలేదని బుకాయించే ప్రయత్నం చేశారు. అప్పట్లో ఎపిఒ ఇచ్చిన ఆర్‌టిఐ సమాచారాన్ని ఫిర్యాదుదారులు ఎంపిడిఒకు అందజేశారు. ఈ క్రమంలో ఫిర్యాదుదారులు, ఫీల్డ్ అసిస్టెంట్‌కు మద్దతుగా వచ్చిన సర్పంచ్ గ్రూపు మధ్య స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. దీంతో అధికారులు అంతటితో విచారణ ముగించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఎంపిడిఒ తెలిపారు.

లక్ష్యాలను పూర్తి చేయాలి

ప్రజాశక్తి-గంట్యాడ

హార్టికల్చర్ పనుల్లో భాగంగా మొక్కలు నాటేందుకు ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని డ్వామా పీడీ ఉమా పరమేశ్వరి సిబ్బందికి సూచించారు. శుక్రవారం నందాం గ్రామంలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 40 ఎకరాల్లో ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని, లేని యెడల చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉపాధి పనులు సక్రమంగా జరిగినట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో ఎపిఒ సుందరావు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయడం అదృష్టం

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం సంతోషంగా ఉందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన అన్నారు. బేబినాయన జన్మదిన వారోత్సవాలలో భాగంగా 17వ వార్డులో కౌన్సిలర్ బి.శ్రీదేవి, వార్డు ఇన్‌ఛార్జి కింతలి బంగార్రాజు పట్టణంలో ఉన్న పేద మహిళలకు నిత్యావసర కిట్లు పంపిణీ చేశారు. టిడిపి అభిమానులు, కార్యకర్తలు, మహిళల సమక్షంలో కేక్ కట్ చేసి ముందస్తు జన్మదిన వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

25న ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఈనెల 25న జరజాపు పేటలో ఉచిత కంటి వైద్య శిభిరం నిర్వహిస్తున్నట్లు సాధన యువజన సంఘం అధ్యక్షులు పోలుబోతు దుర్గా ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో కీర్తి శేషులు అవ నాపు సూర్యనారాయణ, మద్దిలఆది నారాయణ జ్ఞాప కార్థం స్థానిక వెంకట మురళీ కష్ణ కల్యాణ మండపంలో ఈ ఉచిత కంటి వైద్య శిభిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కంటి పరీక్షలు చేసి శస్త్ర చికిత్స (లెన్స్ కేటరాక్ట్) లు ఉచితంగా చేస్తారని తెలిపారు. కంటి మీద కండ, మెల్ల కన్ను సరి చేయడం, శుక్లాలు ఉన్న పెద్దలు, పిల్లలకు ఆరోగ్య శ్రీ ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేస్తారని తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్ కార్డు తప్పని సరిగా తీసుకోని రావాలని దుర్గా ప్రసాద్ కోరారు.

నవోదయ ఫలితాల్లో 'గ్లోబల్' సత్తా

ప్రజాశక్తి-రామభద్రపురం

నవోదయ ఫలితాల్లో గ్లోబల్ పాఠశాల విద్యార్థులు సత్తాచాటినట్లు కరస్పాండెంట్ మోహన్ కుమార్ తెలిపారు. చేతన్‌సాయి, జోషిత, రేవంత్‌నాయుడు నవోదయ ప్రవేశ పరీక్షలో సత్తాచాటి ఎంపికైనట్లు చెప్పారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయన అభినందించారు.

విద్యుత్తు ఛార్జీల భారాలను ప్రతిఘటించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి-కొత్తవలస

రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై పెను భారం మోపిందని, ఈ భారాలను ప్రజలంతా ప్రతిఘటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ అన్నారు. పెరిగిన విద్యుత్ ఛార్జీల భారాలపై శుక్రవారం కొత్తవలసలో సిపిఎం నాయకులు గాడి అప్పారావుతో కలిసి పలుచోట్ల ప్రజలను కలిసి వివరించారు. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నడూ లేని విధంగా కరెంట్ బిల్లులుతో జనానికి షాక్ ఇస్తుందని అన్నారు. మరో పక్క స్మార్ట్ మీటర్లతో మరో ముప్పు తెచ్చిందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కయి ప్రజలకు షాక్ ఇస్తున్నాయని, గత ఏడాది కరెంటు ఛార్జీలు పెంచి రూ.1400 కోట్ల భారం మోపిందని తెలిపారు. వాడుకున్న కరెంటుకు ప్రతినెలా బిల్లులు కట్టినా మళ్లీ సర్దుబాటు ఛార్జీల పేరుతో జనం నెత్తిన తాజాగా 6వేల కోట్ల రూపాయల భారం మోపారని అన్నారు. మోడీ ప్రభుత్వ ఆదేశాలకు లొంగిపోయిన జగన్ ప్రభుత్వం ఇక ప్రతి నెలా వంటగ్యాస్ లాగానే కరెంటు ఛార్జీలు కూడా పెంచడానికి ఆదేశాలు ఇచ్చారన్నారు. విద్యుత్ బిల్లులే కాకుండా ఫిక్స్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, సర్ ఛార్జీలు, విద్యుత్ సుంకం, సర్దుబాటు ఛార్జీలు ఇలా రకరకాల పేర్లు పెట్టి జనాన్ని పీల్చిపిప్పి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే ఉపసంహరించుకోవాలని, లేదంటే ప్రజానీకాన్ని సమీకరించిన ఉద్యమానికి సిద్ధమవుతామని హెచ్చరించారు.



కొత్తవలసలో విద్యుత్తు ఛార్జీల పెంపుదలపై మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

వామపక్షాలు చేపట్టే ఆందోళనల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

బొబ్బిలి : పెరిగిన కరెంట్ బిల్లులతో చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆటో కార్మికులు ఆవేదన వ్యక్తంచేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శంకరరావు ఆధ్వర్యాన విద్యుత్తు బిల్లుల భారంపై ప్రజా సర్వే చేపట్టారు. తమ ఇళ్లల్లో టీవీ, రెండు బల్బులు, ఒక ఫ్యాన్ ఉంటే గతంలో రూ.150 నుంచి 200 వరకు బిల్లు వచ్చేదని, ఇప్పుడు రూ.500 దాటుతోందని ఆటో కార్మికులు వాపోయారు. గతంలో ఎన్నడూ ఇలా బిల్లులు రాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యక్రమంలో వీరన్న, బి.టి.ఆర్ ఆటో కార్మికులు పాల్గొన్నారు.

రాజాం : రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపే సర్దుబాటు ఛార్జీల విధానాన్ని వెంటనే రద్దు చేయాలని సిపిఎం నాయకులు సిహెచ్ రామ్మూర్తి నాయుడు అన్నారు. రాజయ్య పేటలో శుక్రవారం ఇంటింటా సర్వేలో భాగంగా విద్యుత్తు భారాలను ప్రజలకు వివరించారు.విద్యుత్ ఛార్జీల పెంపును ప్రజలంతా వ్యతిరేకించాలన్నారు. భారాలను నిరసిస్తూ ఈనెల 30న అన్ని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన నిర్వహిస్తామని, పెద్ద ఎత్తున ప్రజానికం పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సత్యారావు, శ్రీనివాసరావు , ఆదియా , సురేష్ , శంకర్రావు సత్యవతి, సరస్వతి చిన్నమ్మలు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ప్రజలకు మరింత మేలు


ఎమ్మెల్యేలు కడుబండి, శంబంగి

ప్రజాశక్తి-కొత్తవలస

రాష్ట్రంలో ముఖ్యమంత్రి శ్రీకారంచుట్టిన జగనన్న సురక్షతో ప్రజలకు మరింత మేలు చేకూరుతుందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి పౌరుడికి ప్రభుత్వ పథకాలు అందించడమే జగనన్న సురక్ష ఉద్దేశమని అన్నారు. అట్టడుగు వర్గాల వారికి వంద శాతం ప్రభుత్వ పథకాలు అందాలని, అర్హులైన ఎవరూ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదనే లక్ష్యంతో ఈకార్యక్రమం తలపెట్టారని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కొప్పుల కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడు బాబు, నియోజకవర్గ పరిశీలికులు తైనాల విజయ్ కుమార్, ఎఎంసి చైర్మన్ మూకల కస్తూరి, ఎంపిపిలు నీలం శెట్టి గోపమ్మ, దొగ్గ సత్యవంతుడు, గేదెల శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి తూర్పాటి వరలక్ష్మి, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, మండల పార్టీ అధ్యక్షులు ముమ్ములూరు జగన్నాథం, గొర్లె రవికుమార్, మోపాడ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు కోరారు. తాడేపల్లిలో సిఎం జగన్ ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని





బొబ్బిలిలో ట్యాబులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు, కొత్తవలసలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మున్సిపల్ కార్యాలయంలో తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందాలని లక్ష్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, వాలంటీర్లు, గృహసారథులు, వైసిపి నాయకులు ఇంటింటికి వెళ్లి వారికి అవసరమయ్యే సర్టిఫికెట్లు జారీ చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలు అందని అర్హులుంటే అందేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సావు మురళి, వైస్ చైర్మన్లు చెలికాని మురళి, జి.రమాదేవి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ట్యాబులు పంపిణీ.. మున్సిపాలిటీలో రీసర్వే చేపట్టేందుకు టౌన్ ప్లానింగ్ కార్యదర్శులకు ఎమ్మెల్యే శంబంగి ట్యాబులు పంపిణీ చేశారు. రీసర్వే ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని ఆదేశించారు. రీసర్వేలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

డెంకాడ : మండలంలో మోపాడ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఎంపిపి బంటుపల్లి వెంకట వాసుదేవరావు శుక్రవారం ప్రారంభించారు. ముందుగా సిఎం జగన్ సందేశాన్ని వీడియోకాన్ఫరెన్స్ ద్వారా విన్నారు. అనంతరం జగనన్న సురక్ష విధివిధానాల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ నెలరోజులపాటు అన్ని సచివాలయాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మునాయుడు, ఎంపిడిఒ డిడి స్వరూపరాణి, డిప్యూటీ తహశీల్దార్, సర్పంచులు బడ్డుకొండ రమేష్‌నాయుడు, ఎస్.బంగారురెడ్డి పాల్గొన్నారు.

వేపాడ : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు, ప్రజాప్రతినిధులు తిలకించారు. కార్యక్రమంలో ఎంపిపి దొగ్గ సత్యవంతుడు, ఎఎంసి చైర్‌పర్సన్ ఎం.కస్తూరి, జెడ్‌పిటిసి సేనాపతి అప్పారావు, వైస్ ఎంపిపి అడపా ఈశ్వరరావు, ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, ఎపిఎం శ్రీనివాస్, ఎంపిటిసిలు ఆకుల సత్యనారాయణ, గాడి గంగమ్మ, కోఆప్షన్ సభ్యులు నర్సయ్య, ఓబలయపాలెం శేఖర్, అడపా హరీష్ పాల్గొన్నారు. సింగరాయి సచివాలయంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు ఎం.జగన్నాథం, జెసిఎస్ కన్వీనర్ బి.శ్రీనివాసరావు, సర్పంచ్ నిరుజోగి వెంకటరావు, ఎంపిటిసి రాజేష్, పివి రమణ, ఎంఎల్ఒ అవతారం, పంచాయతీ కార్యదర్శి కన్నమనాయుడు పాల్గొన్నారు.

సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతాం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అన్ని డివిజన్లనూ అభివృద్ధి చేస్తూ, సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే వీరభద్రస్వామి నిరంతరం కృషి చేస్తున్నారని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. నగరంలోని 14వ డివిజన్ కొత్తపేట పరిసర ప్రాంతాల్లో శుక్రవారం కొనసాగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలనను ఆరా తీస్తూ, పథకాల లబ్ధిని వివరిస్తూ, ప్రజాస్పందనను తెలుసుకున్నారు. స్థానిక సమస్యలపై తీశారు. కొన్ని చోట్ల కాలువలు, వీధి దీపాల సమస్యను స్థానికులు తీసుకురాగా వెంటనే అక్కడ ఉన్న అధికారులను పిలిచి పరిష్కారానికి తగు చర్యలు తక్షణమే చేపట్టాలని ఆమె సూచించారు. అవసరమైన చోట్ల పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు. ఇంకా అర్హత ఉండి ఎవరైనా పథకాలకు దూరమైతే, జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో 14వ డివిజన్ అధ్యక్షులు ఇసరపు శ్రీనివాసరావు, ఎఎంసి చైర్‌పర్సన్ నడిపేన శశి భార్గవి, ఫ్లోర్ లీడర్ ఎస్.వి.వి రాజేష్, ప్రభుత్వ సిబ్బంది పాల్గొన్నారు.

పూర్ణానంద స్వామిపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

బాలికపై అత్యాచారానికి పాల్పడిన పూర్ణానంద స్వామిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యాన మహిళలు దేవిబొమ్మ కూడలి వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆ సంఘం జిల్లా గౌరవాధ్యక్షురాలు మద్ది మాణిక్యం మాట్లాడుతూ మహిళలపై అత్యాచారాలు, దాడులు జరుగుతున్నా ప్రభుత్వంలో ఏమాత్రం చలనం లేదని అన్నారు. మహిళల రక్షణకు ప్రభుత్వాలు అనేక చట్టాలు తీసుకొచ్చినప్పటికీ వాటిని పటిష్టంగా అమలు చేయకపోవడంతోనే రోజురోజుకూ ఘోరాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన పూర్ణానంద స్వామిపై చర్యలు తీసుకోవడంతో పాటు ఆశ్రమం లొసుగులను వెలికితీసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో షేక్ చాంద్ బీబీ, ఆదిమూలం పార్వతి, వి.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

'కాపుల మద్దతు జనసేనకే'

ప్రజాశక్తి-శృంగవరపుకోట

హరిరామజోగయ్య చేపట్టిన సర్వే నివేదిక ప్రకారం రాష్ట్రంలో కాపు సామాజిక తరగతి మద్దతు జనసేన పార్టీకే అత్యధికంగా ఉందని సౌత్ ఇండియన్ కాపు అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వబ్బిన సన్యాసినాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇటీవల హరిరామజోగయ్య రాష్ట్రంలో వివిధ సామాజిక తరగతుల మద్దతుపై సర్వే చేపట్టినట్లు తెలిపారు. జనసేన పార్టీకి 80 శాతం కాపు సామాజిక తరగతి మద్దతు ఇస్తున్నట్లు చెప్పారు. టిడిపికి 8 శాతం, వైసిపికి 12 శాతం మద్దతు ఇస్తున్నట్లు సర్వే నివేదికలు చెబుతున్నట్లు వివరించారు. బిసిల ఓట్ల విషయానికి వస్తే జనసేన పార్టీకి 25 శాతం, టిడిపికి 40 శాతం, వైసిపికి 35 శాతం మద్దతు ఉన్నట్లు తెలిపారు. ఎస్‌సిలకు సంబంధించి జనసేనకు 26 శాతం మద్దతు ఉన్నట్లు చెప్పారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని అక్కివరం పంచాయతీ గొల్లపేటకు చెందిన నక్క రమణ (38) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం... నక్క రమణ నిత్యం అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. జీవితంపై విరక్తి చెంది ఈ నెల 20న పురుగుల మందు తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి రమణ మృతిచెందాడు. ఎస్ఐ మహేష్ కేసు నమోదు చేశారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సిఐ కె.కె.వి.విజయానంద్ కోరారు. శుక్రవారం మాదక ద్రవ్యాల రహిత ఆంధ్రప్రదేశ్ అనే కార్యక్రమంపై స్థానిక చక్ర జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ రహిత సమాజానికి అన్నివర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా మంచిమార్గంలో నడవాలని సూచించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని హితవుపలికారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.నారాయణరావు పాల్గొన్నారు.



వేపాడ.. మాట్లాడుతున్న ఎస్ఐ రాజేష్

వేపాడ : మండలంలో బక్కునాయుడుపేటలోని బి.ఆర్ అంబేద్కర్ గురుకులంలో బాలికలకు ఎస్ఐ రాజేష్ అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఫ్లోరెన్స్, వైస్ ప్రిన్సిపల్ ఉషారాణి పాల్గొన్నారు.

వరి విత్తనాలు పంపిణీ

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలోని కొత్తబగ్గాం గ్రామంలో రాయితీ వరి విత్తనాలను వ్యవసాయ శాఖ ఎడి మహారాజన్ శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలను తీసుకున్న రైతులు మొలక శాతం పరీక్ష చేసుకోవాల్సిందిగా సూచించారు. మొలకశాతం 80 శాతం లేదా అంత కన్నా ఎక్కువ ఉండాలన్నారు. అంతకన్నా తక్కువ మొలక శాతం ఉంటే వెంటనే వాటిని మార్చి వేరే బ్యాగ్ ఇస్తామని తెలిపారు. పంట సాగు హక్కు పత్రం ద్వారా ప్రభుత్వం ద్వారా అన్ని రకాల పథకాలు అందుతాయని కౌలురైతులకు తెలిపారు. కార్యక్రమంలో ఎఒ ధనలక్ష్మి, సర్పంచ్ పల్లి సంజీవరావు, ఎంపిటిసి సారికి నారాయణరావు పాల్గొన్నారు.



వేపాడ.. విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎంపిపి సత్యవంతుడు

వేపాడ : మండలంలోని జాకేరు గ్రామంలో శుక్రవారం రైతులకు సబ్సిడీపై వరి విత్తనాలను ఎంపిపి డి.సత్యవంతుడు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సర్పంచ్ బుద్దా చిన్నమ్మలు, గ్రామ నాయకులు బుద్దా అప్పలనాయుడు, పంచాయతీ కార్యదర్శి ప్రభుదాసు, విఎఎ పాల్గొన్నారు.